
ప్రజాశక్తి
శుక్రవారం 25 నవంబర్ 2022
5
విజయనగరం



29, 30 తేదీల్లో జిల్లా స్థాయి పోటీలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

సిఎం కప్ ప్రైజ్‌మనీ జిల్లా స్థాయి పోటీలను ఈ నెల 29, 30 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు సెట్విజ్ సిఇఒ రామానందం, చీఫ్ కోచ్ అప్పలనాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. కబడ్డీ, వాలీబాల్, బ్యాడ్మింటన్, క్రికెట్ క్రీడాంశాల్లో పోటీలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. కబడ్డీ పురుషులు 55 నుంచి 85 కేజీలు, మహిళలకు 55 నుంచి 75 కేజీలు విభాగాల్లో పోటీలు ఉంటాయని చెప్పారు. వాలీబాల్.. పురుషులు, మహిళలకు, క్రికెట్.. పురుషులకు పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బ్యాడ్మింటన్.. సింగిల్స్, డబుల్స్ విభాగంలో పురుషులకు, మహిళలకు జోనల్ స్థాయిలో మాత్రమే పోటీలు నిర్వహించాలని నిర్ణయించారు. నియోజకవర్గ స్థాయిలో ఎంపికైన కబడ్డీ, వాలీబాల్, క్రికెట్ జట్లకు 29, 30 తేదీల్లో రాజీవ్, విజ్జీ స్టేడియంలో పోటీలు నిర్వహిస్తామని వారు తెలిపారు. వివరాలకు 9133773485, 8309800345 నంబర్లను సంప్రదించాలని కోరారు.



కొండనాలుకకు మందేస్తే ఉన్న నాలుక ఊడిపోయినట్లుగా ఉంది మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ పనితీరు. ప్రిన్సిపల్ వైఖరి ప్రజారోగ్యంతో చెలగాటంగా మారుతోంది. ఇటు రోగులు, అటు వైద్యులు కూడా అవస్థలు పడుతున్నారు. చివరికి ఏరియా ఆస్పత్రులు, సిహెచ్‌సిల్లో కేంద్రప్రభుత్వం ఈ ఏడాది ప్రవేశపెట్టనున్న డిఎన్‌బి కోర్సుల అర్హతను కూడా కోల్పోయే ప్రమాదం కనిపిస్తోంది.

- వైద్యులను రిలీవ్ చేయకపోవడంతో ఆస్పత్రుల్లో అందని వైద్యసేవలు
- వైద్యులపైనా పనిభారం
- డిఎన్‌బి ప్రవేశాల అర్హత కోల్పోనున్న ఆస్పత్రులు

ప్రజారోగ్యంతో చెలగాటం..

వైద్య కళాశాల ప్రిన్సిపల్ నిర్వాకం

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

జిల్లాకు ప్రభుత్వ మెడికల్ కళాశాల మంజూరైన విషయం విదితమే. మెడికల్ కళాశాల కోసం జిల్లా కేంద్రాస్పత్రిని కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఇక్కడ పనిచేయడానికి తగినంత మంది వైద్యులు, 706 మంది సిబ్బందిని కూడా నియమిస్తోంది. దీంతో ఇప్పటి వరకు ఇక్కడ పనిచేస్తున్న వైద్యవిధాన పరిషత్ వైద్యులందరినీ ఏపీ వైద్యవిధాన పరిషత్తు పరిధిలోని శృంగవరపుకోట, గజపతినగరం, రాజాం ఏరియా ఆస్పత్రులు, చీపురుపల్లి, భోగాపురం, నెల్లిమర్ల, బాడంగి, బొబ్బిలి కమ్యూనిటీ హెల్త్ సెంటర్లకు సంబంధిత విభాగం బదిలీ చేసింది. మెడికల్ కాలేజీ తరఫున నియమించిన సుమారు 20 మంది వైద్యులు చేరినా ఇక్కడి నుంచి బదిలీ అయిన 22 మందిని రిలీవ్ చేయడం లేదు. దీంతో, ఏరియా, కమ్యూనిటీ ఆస్పత్రుల్లో వైద్యసేవలు అంతంత మాత్రంగానే అందుతున్నాయి. ఇటీవలే పైన పేర్కొన్న ఆస్పత్రులను అప్‌గ్రేడ్ చేసి, పడకల సంఖ్య, పోస్టుల సంఖ్య పెంచినట్టు స్థానిక ప్రజాప్రతినిధులతోపాటు ప్రభుత్వం చెప్తూ వచ్చింది. దీనిపై తెగేసి ప్రచారం చేయడంతో ఎక్కువ మంది రోగులు ఆయా ఆస్పత్రులకు వెళ్తున్నారు. ఈనేపథ్యంలో ఒపి సంఖ్య కూడా రెట్టింపైంది. ఏరియా ఆస్పత్రులకు గతంలో నెలకు 10 వేల ఒపి రాగా, ప్రస్తుతం 18 వేల వరకు ఉంటోంది. ఇన్‌పేషెంట్ల సంఖ్య కూడా అందుకు తగ్గట్టే పెరిగింది. సిహెచ్‌సిల్లోనూ ఒపి, ఐపి పెరిగిందని స్థానిక వైద్యాధికారులు చెబుతున్నారు. కానీ, ఈ ఆస్పత్రుల్లో చేరాల్సిన వైద్యులను మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పద్మలీల విడుదల చేయడం లేదు. ఇప్పుడిప్పుడే నియామకాలు జరుగుతున్నాయని, అంతా కొలిక్కివచ్చాక ఆలోచిస్తానని అంటున్నట్లు సమాచారం. దీనివల్ల ఆయా ఆస్పత్రుల స్థాయికి తగ్గట్టు వైద్యులు లేరు. ముఖ్యంగా బొబ్బిలి, బాడంగిలో గైనకాలజిస్టులు లేరు. చీపురుపల్లి, భోగాపురం, బొబ్బిలిలో చిన్నపిల్లల వైద్యులు, ఎస్.కోటలో ఎముకల వైద్యులు, నెల్లిమర్లలో జనరల్ ఫిజీషియన్ లేరు. భోగాపురంలో సర్జన్, గజపతినగరంలో ఇఎన్‌టి లేనట్టు సమాచారం. దీంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు పెరిగిన ఒపి, ఐపిల వల్ల తమపై పనిభారం పెరుగుతోందని వైద్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటు జిల్లా కేంద్రం (మెడికల్ కాలేజీ)లో ఆస్పత్రికి కొత్తగా వచ్చినవారు, ఇక్కడి నుంచి వెళ్లాల్సిన వారు గతం కంటే రెట్టింపు అంటే సుమారు 42మంది వైద్యులు ఉన్నారు. వీరిలో బదిలీపై వెళ్లాల్సిన 22 మంది మాత్రమే ఒపి నిర్వహిస్తుండడం, కొత్తగా వచ్చిన వారికి పనిలేకుండా పోవడం గమనార్హం.

మరోవైపు ఈ ఏడాది నుంచి డిఎన్‌బి (డిప్లమా నేషనల్ బోర్డ్) కోర్సుల అర్హత కల్పించేందుకు కేంద్ర ఆరోగ్య శాఖ కసరత్తు చేస్తోంది. ఇందుకోసం రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లోని ఏరియా ఆస్పత్రులు, సిహెచ్‌సిల్లో ఫ్యామిలీ మెడిసిన్, గైనిక్, పీడియాట్రిక్స్, ఎనస్థీషియా, ఆర్థో, ఇఎన్‌టి తదితర విభాగాల్లో పనిచేస్తున్న వైద్యులు, వారి హోదాలను సంబంధిత ఉన్నత అధికారుల నుంచి వైద్యవిధాన పరిషత్తు విభాగం సమాచారం సేకరిస్తోంది. దీని ఆధారంగా వైద్యుల సంఖ్య, సీనియారిటీ ఆధారంగానే ఆయా ఆస్పత్రుల్లో డిఎన్‌బి కోర్సుల ప్రవేశానికి అర్హత ఉంటుంది. కానీ ఆయా ఆస్పత్రులకు వెళ్లాల్సిన సీనియర్ వైద్యులంతా మెడికల్ కాలేజీలోనే ఉండిపోవడంతో ఆ అర్హతను కోల్పోయే ప్రమాదం ఉంటుందని పలువురు వైద్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ పద్మలీలను వివరణ కోరేందుకు 'ప్రజాశక్తి' ప్రయత్నించగా దాటవేత ధోరణి అవలంబించారు.

చిరుజల్లులతో గుబులు

- వర్షానికి తడిసిన వరి పనలు
- రైతుల్లో భయాందోళన

జిల్లాలో గురువారం కురిసిన చిరుజల్లులు రైతులను హడలెత్తించాయి. కోసిన వరిచేను పొలాల్లో ఉండటంతో తీవ్ర ఆందోళన కలిగించాయి. పంటను కాపాడుకునేందుకు రైతులను పొలాల వైపు పరుగులు పెట్టించాయి. పంట చేతికొచ్చే సమయంలో అల్పపీడన ప్రభావంతో మేఘాలు మబ్బులుగా ఉండడంతో అన్నదాతలను ఆందోళన వెంటాడుతూనే ఉంది.



వంగరలో వరిచేను కుప్పలు పెడుతున్న రైతులు

ప్రజాశక్తి-బొబ్బిలి

అల్పపీడన ప్రభావంతో జిల్లాలో గురువారం ఉదయం పలుచోట్ల చిరుజల్లులు కురిశాయి. బొబ్బిలి, బాడంగి, రామభద్రపురం, నెల్లిమర్ల, గుర్ల, మెరకముడిదాం, వేపాడ, తదితర మండలాల్లో చిరుజల్లులు కురిశాయి. దీంతో పొలాల్లో కోసేసిన వరిపనలు తడిసిపోయాయి. వాతావరణం ఒక్కసారిగా మారడంతో రైతులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. బొబ్బిలి నియోజకవర్గంలో 95 శాతం వరికోత దశకు వచ్చింది. 70 శాతానికి పైగా వరి కోతలు పూర్తయ్యాయి. నాలుగు రోజుల క్రితం వాతావరణశాఖ హెచ్చరికలు రావడంతో వరి కోతలను రైతులు వాయిదా వేసుకున్నారు. కానీ వర్షం కురవకపోవడంతోపాటు ఎండలు కాయడంతో రైతులు వర్షాలు రావనే నమ్మకంతో బుధవారం వరికోతలు ప్రారంభించారు. తుపాను హెచ్చరికలకు ముందు కోసేసిన వరిచేను రైతులు కుప్పలు వేయగా, బుధవారం కోసిన వరిపంటను కుప్పలు వేయకపోవడంతో గురువారం కురిసిన చిరుజల్లులకు తడిసిపోయింది. చేతికి వచ్చిన పంట తడిసిపోవడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. కష్టపడి, అప్పులు చేసి సాగు చేస్తున్న పంట తడిసిపోవడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు. ప్రభుత్వం ఇంకా ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించకపోవడంతో రైతులు పంటను పొలాల్లోనే కుప్పలువేశారు. ఎక్కడ చూసినా పొలాల్లో కుప్పలు దర్శనమిస్తున్నాయి. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి ధాన్యం కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.



ద్వితీయ స్థానం సాధించిన బాలురు జట్టు



తృతీయ స్థానంలో నిలిచిన బాలికల జట్టు

షూటింగ్‌బాల్‌లో సత్తాచాటారు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

అనకాపల్లి జిల్లాలో జరిగిన అండర్-19 షూటింగ్ బాల్ పోటీల్లో జిల్లా బాలబాలికల జట్లు సత్తాచాటాయి. బాలురు జట్టు ద్వితీయ స్థానం, బాలికల జట్టు తృతీయ స్థానం సాధించాయి. రెండు జట్ల క్రీడాకారులకు జిల్లా షూటింగ్ బాల్ అసోసియేషన్ కార్యదర్శి కృష్ణమూర్తి అభినందనలు తెలిపారు.

నేడు జిల్లాలో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి పర్యటన

ప్రజాశక్తి-విజయనగరం

రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా శుక్రవారం జిల్లాలో పర్యటించనున్నారు. ఎన్నికల కమిషన్ సిఇఒ శుక్రవారం మధ్యాహ్నం నాలుగు గంటలకు పార్వతీపురం నుంచి విజయనగరం చేరుకొంటారు. కలెక్టర్ కార్యాలయంలో జిల్లా ఎన్నికల అధికారి, ఇఆర్ఒలు, ఎఇఆర్ఒలతో సమావేశం నిర్వహిస్తారు. సాయంత్రం 5.10 గంటలకు నగర పరిధిలోని పోలింగ్ కేంద్రాలను సందర్శించి బిఎల్ఒలు, బూత్ స్థాయి సిబ్బందితో మాట్లాడతారు. 5.25 గంటలకు రూరల్ పోలింగ్ కేంద్రాలు సందర్శిస్తారు. 5.45 గంటలకు విశాఖ బయలుదేరి వెళ్లనున్నారు.

16 డివిజన్లకు రేపు తాగునీటి సరఫరా బంద్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

కార్పొరేషన్ పరిధిలో 16 డివిజన్లకు శనివారం మంచినీటి సరఫరా నిలిపేస్తున్నట్లు ఇఇ పి.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ముషిడిపల్లి పంపింగ్ స్టేషన్ నుండి విజయనగరం వరకు ఉన్న పైపులైను లీకులను అరికట్టేందుకు శుక్రవారం పనులు చేపట్టడం వల్ల తాగునీటి సరఫరాను నిలిపివేస్తున్నట్లు చెప్పారు. దీనివల్ల శనివారం 20, 21, 22, 23, 24, 25, 26, 27, 28, 29, 35, 37, 38, 39, 40, 41 డివిజన్లకు తాగునీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందని చెప్పారు. ప్రజలు సహకరించాలని కోరారు.

భవన నిర్మాణాలకు నిధుల కొరత లేదు

రూ.443 కోట్లతో సచివాలయాలు, ఆర్‌బికె, వెల్‌నెస్ సెంటర్లు : కలెక్టర్ ఎ.సూర్యకుమారి

ప్రజాశక్తి-విజయనగరం

ఉపాధిహామీ కింద, కన్వర్జెన్సీ నిధులతో గ్రామాల్లో వివిధ ప్రభుత్వ భవనాల నిర్మాణం జోరుగా సాగుతోందని కలెక్టర్ ఎ.సూర్యకుమారి తెలిపారు. సుమారు రూ.443.74 కోట్లతో జిల్లా వ్యాప్తంగా 530 గ్రామ సచివాలయాలు, 496 రైతు భరోసా కేంద్రాలు, 438 వెల్‌నెస్ సెంటర్లతోపాటు, 140 పాల శీతలీకరణ కేంద్రాలు, 173 డిజిటల్ లైబ్రరీల నిర్మాణం చేపడుతున్నట్లు ఒక ప్రకటనలో వెల్లడించారు. ఇప్పటివరకు సుమారు రూ.203.34 కోట్ల బిల్లులను చెల్లించినట్లు తెలిపారు. ప్రస్తుతం పెండింగ్ ఉన్న రూ.16 కోట్ల బిల్లులు ఈ వారంలో విడుదల కానున్నాయని వివరించారు.



ప్రారంభించిన ఉత్తరాపల్లి సచివాలయ భవనం

రూ.194.35కోట్ల అంచనా వ్యయంతో 530 గ్రామ సచివాలయ భవనాలు మంజూరు కాగా, ఇప్పటివరకు రూ.114.21 కోట్లను ఖర్చుచేసినట్లు తెలిపారు. 5 భవనాలు మినహా మిగతావన్నీ వివిధ దశల్లో ఉన్నాయని తెలిపారు. పూర్తయినవి 355 కాగా, అప్పగించిన భవనాలు 123, మరో 55 సచివాలయ భవనాలు ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. రూ.106.60 కోట్లతో 496 రైతు భరోసా కేంద్రాల నిర్మాణానికి ప్రతిపాదించగా, వీటికోసం రూ.53 కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపారు. 17 ఆర్‌బికెలు మినహా, మిగిలినవన్నీ వివిధ దశల్లో ఉన్నాయని వివరించారు. 242 భవనాలు పూర్తయ్యాయని, వీటిలో 71 ఆర్‌బికెలను అప్పగించగా, వీటిలో 48 భవనాలు ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయని తెలిపారు.

జిల్లాలో సుమారు రూ.75.87 కోట్లతో 438 వెల్‌నెస్ సెంటర్ల నిర్మాణానికి ప్రతిపాదించగా, ఇప్పటివరకు రూ.34.85 కోట్లను ఖర్చు చేసినట్లు చెప్పారు. 26 భవనాల నిర్మాణం ఇంకా ప్రారంభించాల్సి ఉందని పేర్కొన్నారు. 150 భవనాల నిర్మాణం పూర్తికాగా, 36 సెంటర్లు ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. జిల్లాలో రూ.38.74 కోట్లతో 140 పాల శీతలీకరణ కేంద్రాలు, రూ.28.16 కోట్లతో 173 డిజిటల్ లైబ్రరీల నిర్మాణ పనులు వివిధ దశల్లో ఉన్నాయని కలెక్టర్ పేర్కొన్నారు.

ప్రత్యేక కార్యాచరణతో కేసుల దర్యాప్తు

మాసాంతర నేర సమీక్షలో ఎస్‌పి దీపిక

ప్రజాశక్తి-విజయనగరం

ప్రత్యేక కార్యాచరణతో కేసుల దర్యాప్తు పూర్తిచేయాలని ఎస్‌పి దీపిక.. పోలీసు అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీసు అధికారులతో నేర సమీక్షా సమావేశాన్ని గురువారం జిల్లా పోలీసు కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ దర్యాప్తులో ఉన్న గ్రేవ్, నాన్ గ్రేవ్ కేసుల సంఖ్యను తగ్గించేందుకు దర్యాప్తు అధికారులకు లక్ష్యాలను నిర్దేశించారు. ఆయా కేసుల్లో దర్యాప్తును నెలలో పూర్తి చేయాలన్నారు. స్టేషన్లలో నమోదైన కేసుల్లో సాధించిన ప్రగతిని సిసిటిఎన్ఎస్ వెబ్ పోర్టల్ లో ఎప్పటికప్పుడు నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. అనధికార ఇసుక డంపులను, పేకాట, కోడి పందాలు నిర్వహించే స్థావరాలను గుర్తించి, దాడులు నిర్వహించాలని సూచించారు. జిల్లాలో రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా నమోదైన మొదటి 10 పోలీసు స్టేషన్లలో ప్రమాదాలకు గల కారణాలను, నియంత్రణకు చేపట్టిన చర్యలపై



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌పి దీపిక

ఎస్‌పి సమీక్షించారు. విధులను సమర్ధవంతంగా నిర్వహించి, విధి నిర్వహణలో ప్రతిభ కనబర్చిన వారిని, లోక్ అదాలత్ కేసులు ఎక్కువగా డిస్పోజ్ చేయుటలో క్షేత్ర స్థాయిలో క్రియాశీలకంగా పనిచేసిన పోలీసు అధికారులు, సిబ్బందిని ఎస్‌పి అభినందించి, ప్రశంసా పత్రాలను అందజేశారు.

సమావేశంలో ఎస్ఇబి ఎఎస్‌పి ఎన్.శ్రీదేవిరావు, బొబ్బిలి డిఎస్‌పి బి.మోహనరావు, ట్రాఫిక్ డిఎస్‌పి ఎల్.మోహనరావు, ఎస్‌సి, ఎస్‌టి సెల్ డిఎస్‌పి ఆర్.శ్రీనివాసరావు, డిటిసి డిఎస్‌పి వీరకుమార్, దిశ డిఎస్‌పి ఎం.వెంకటేశ్వర్లు, న్యాయ సలహాదారులు వై. పరశురాం పాల్గొన్నారు.

ధరల పెరుగుదలపై టిడిపి గగ్గోలు

మనుగడ కోసం ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారు : డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి



మాట్లాడుతున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

ధరల పెరుగుదలపై టిడిపి గగ్గోలు పెడుతోందని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి విమర్శించారు. గురువారం కంటోన్మెంట్ జోనల్ కార్యాలయంలో 40, 41, 44, 45, 46, 47 డివిజన్లకు సంబంధించి వైసిపి నాయకులతో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కమిటీల నియామకానికి సంబంధించిన పుస్తకాలను ముఖ్య నాయకులకు అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తలకు కోలగట్ల దిశానిర్దేశం చేశారు. టిడిపి కేవలం మనుగడ కోసమే ప్రజలను మభ్యపెట్టి, తప్పుదోవ పట్టిస్తోందని ఆరోపించారు. ధరల పెరుగుదల విషయంలో నానా యాగి చేస్తున్నారని ధ్వజమెత్తారు. కానీ ఆ పార్టీ చేపడుతున్న బాదుడే బాదుడు కార్యక్రమాన్ని ప్రజలు ఆదరించడం లేదన్న విషయాన్ని గుర్తించాలన్నారు. ఏ రాజకీయ పార్టీకైనా మనుగడ కొనసాగాలంటే కార్యకర్తలే ముఖ్యమన్నారు. వారి కష్టం ఫలితంగానే 2019 ఎన్నికల్లో వైసిపి విజయం సాధించడమే కాకుండా తమకు పదవులు లభించాయన్నారు. అందుకే కార్యకర్తలతో అనునిత్యం మమేకమవుతూ వస్తున్నామని చెప్పారు.

కరోనా కష్టకాలంలో ప్రజలకు అండగా నిలిచామని, అందుకే చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా 48 డివిజన్లలో వైసిపి విజయకేతనం ఎగురవేసిందని తెలిపారు. సంస్థాగతంగా కమిటీలను ఏర్పాటు చేసుకుని రానున్న ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా కృషి చేయాలని పార్టీ శ్రేణులకు సూచించారు. సమావేశంలో వైసిపి జోనల్ ఇన్‌ఛార్జి కోలగట్ల తమన్న శెట్టి, కార్పొరేటర్లు పట్నాన పైడిరాజు, సుంకర నారాయణస్వామి, బోనెల ధనలక్ష్మి, బొద్దూరు గోవిందమ్మ, తాళ్లపూడి సంతోషి కుమారి, నాయకులు దూబే, తమ్ము, కోఆప్షన్ సభ్యులు రహీం, తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు ప్రారంభం

ప్రజాశక్తి-బాడంగి



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శంబంగి

మండలంలోని రేజేరు గ్రామంలో రైతుభరోసా కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ఎలాంటి అన్యాయం జరగకుండా చూసేందుకు ప్రభుత్వం ఆర్‌బికెల ద్వారా అత్యంత పారదర్శకంగా ధాన్యం కొనుగోలు ప్రక్రియకు శ్రీకారం చుట్టిందన్నారు. దళారులు, మిల్లర్ల చేతిలో రైతులు నష్టపోకుండా ఆర్‌బికెల్లో ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రాల్లో రైతులు నేరుగా పంట విక్రయించాలని సూచించారు. ధాన్యం సాధారణ రకం క్వింటాకు రూ.2040, గ్రేడ్ ఎ రకం రూ.2060కు కొనుగోలు చేస్తారని చెప్పారు. ధాన్యం విక్రయించిన రైతుల ఖాతాల్లో 21 రోజుల్లోపు డబ్బులు నేరుగా జమవుతాయని తెలిపారు. కార్యక్రమంలో పౌరసరఫరాల శాఖ డిఎం మీనాకుమారి, జెడ్‌పిటిసి పెద్దింటి రామారావు, వైస్ ఎంపిపి బొమ్మినాయని రమేష్, సర్పంచ్ బొమ్మినాయని వెంకటనాయుడు, ఎడి శ్యామసుందరావు, తెంటు మధు, తహశీల్దార్ బాలమురళీకృష్ణ, వైసిపి నాయకులు వాసిరెడ్డి కిరణ్ కుమార్, మరిపి శంకరరావు, తదితరులు పాల్గొన్నారు.

అద్దెబస్సులను నిలిపేయాలని ధర్నా

ప్రజాశక్తి-విజయనగరం కోట

అద్దెబస్సులను నిలుపుదల చేయాలని కోరుతూ ఎస్‌డబ్ల్యుఎఫ్ ఆధ్వర్యాన స్థానిక డిపో వద్ద గురువారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఎస్‌డబ్ల్యుఎఫ్ జిల్లా కార్యదర్శి వి.రాములు మాట్లాడుతూ అద్దెబస్సులతో ఆర్‌టిసిని నింపడం, విద్యుత్తు బస్సులు ప్రయివేట్ కన్సార్టియం ద్వారా తేవడం, యుటిఎస్ మిషన్లు తీసుకురావడం.. ఇవన్నీ ఆర్‌టిసి ప్రయివేటీకరణలో భాగంగా జరుగుతున్నాయని తెలిపారు. ఏ నెలలో చేసిన ఒటి, నైట్ ఔట్ అలవెన్సులు ఆ నెలలోనే ఇవ్వాలని కోరారు. 2017 నుండి కార్మికులకు రావాల్సిన లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్, ఎరియర్స్ చెల్లించాలని డిమాండ్ చేశారు. అధ్యక్షులు ఎ.చంద్రయ్య మాట్లాడుతూ అద్దె బస్సులు ఆపాలని, విద్యుత్ బస్సులు ఆర్‌టిసినే నేరుగా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వెంకట్రావు, కుమార్, శ్రీనివాసరావు, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.




ధర్నా చేస్తున్న ఎస్‌డబ్ల్యుఎఫ్ నాయకులు, కార్మికులు

అవినీతి రహిత పాలనే లక్ష్యం

ప్రజాశక్తి-గరివిడి

అవినీతి రహిత పాలనే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని జెడ్‌పి ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు తెలిపారు. మండలంలోని ఏనుగువలస గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి వివరించారు. అక్కడ ప్రజా సమస్యలు తెలుసుకున్నారు. వెంటనే ఆ సమస్య పరిష్కారం జరిగేలా చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ కుల, మత, పార్టీలకు అతీతంగా ప్రభుత్వం సంక్షేమాన్ని అందిస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంపిపి మీసాల విజయలక్ష్మి, వైసిపి మండల అధ్యక్షులు మీసాల విశ్వేశ్వరరావు, వైస్ ఎంపిపిలు గుడివాడ వెంకట శ్రీరాములు నాయుడు, గణపతిరాజు రామకృష్ణరాజు, సర్పంచ్ గుడివాడ తమ్మి నాయుడు, బుడి శ్రీరాములు, కొనిసి కృష్ణం నాయుడు, పొన్నాడ కుమార్, లెంక శ్రీరామలు, గేదెల శంకరరావు పాల్గొన్నారు.

బొబ్బిలి : అవినీతికి దారి లేకుండా సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు అన్నారు. గురువారం పట్టణంలోని 23వ వార్డులో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఆయనకు వార్డు ప్రజలు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా? లేదా? అని అడిగి తెలుసుకున్నారు. పలువురు ఇంటింటి కుళాయిలు, సిసి రోడ్లు కావాలని ఎమ్మెల్యేని కోరారు. దానికి ఆయన స్పందిస్తూ కుళాయిలు, రోడ్లు వేయిస్తామని హామీ ఇచ్చారు. ఈ



గరివిడి.. కరపత్రాలను పంపిణీ చేస్తున్న జెడ్‌పి ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

'గడపగడపకు..'లో జెడ్‌పి ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ సావు వెంకట మురళీ కృష్ణారావు, వైస్ ఛైర్మన్లు జి.రమాదేవి, చెలికాని మురళీకృష్ణ, వైసిపి మండల అధ్యక్షులు శంబంగి వేణుగోపాలనాయుడు, బుడా ఛైర్మన్ ఇంటి పార్వతి, పట్టణ అధ్యక్షుడు ఇంటి గోపాలరావు, వార్డు కౌన్సిలర్ కొర్లాపు రామారావు, మున్సిపల్ కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు, తహశీల్దార్ రాజారావు, తదితరులు పాల్గొన్నారు.

విజయనగరం టౌన్ : నగరంలోని 16వ డివిజన్ కమ్మవీధి ప్రాంతంలో గురువారం డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఆయనకు స్థానికులు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా కోలగట్ల మాట్లాడుతూ సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి అవినీతి రహితంగా అర్హులందరికీ పథకాలను అందించడంతో ప్రజలు ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారన్నారు. స్థానికంగా ఉన్న సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరించే దిశగా కృషి చేస్తున్నామన్నారు. నగరంలో చేస్తున్న అభివృద్ధి ప్రస్తుతం కనిపిస్తోందన్నారు. కార్యక్రమంలో మేయర్ విజయలక్ష్మి, కార్పొరేటర్ గుజ్జల నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

కబడ్డీలో 'సత్య' కళాశాలకు తృతీయ స్థానం

విజయనగరం : స్థానిక సత్య డిగ్రీ, పీజీ కళాశాల కబడ్డీ జట్టుకు ఆంధ్ర యూనివర్సిటీ గేమ్స్ 2022-23 లో తృతీయ స్థానం లభించినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.వి.సాయి దేవ మణి తెలిపారు. అంతర కళాశాలల పోటీలు ఆంధ్ర యూనివర్సిటీలో గోల్డెన్ జూబ్లీ గ్రౌండ్స్ లో జరిగాయి. కళాశాల జట్టుకు డిగ్రీ ద్వితీయ సంవత్సరం బిఎ చదువుతున్న టి.లావణ్య కెప్టెన్‌గా వ్యవహరించారు. ఈ సందర్భంగా కళాశాలలో ఏర్పాటు చేసిన అభినందన సభలో కళాశాల డైరెక్టర్ డాక్టర్.ఎం. శశి భూషణరావు మాట్లాడుతూ జట్టు క్రీడాకారులను ప్రత్యేకంగా అభినందిస్తూ భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. కళాశాల కల్పించిన మౌలిక సదుపాయాలు, ఫిజికల్ డైరెక్టర్ జె.మహేశ్వర్ రావు కృషి వీరి విజయానికి కారణమని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఎన్‌సిసి ఆఫీసర్ కెప్టెన్ సత్యవేణి, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ బి.సూరపు నాయుడు పాల్గొన్నారు.



కబడ్డీ జట్టుతో డైరెక్టర్ మజ్జి శశిభూషణరావు

పట్టణాభివృద్ధికి సమగ్ర ప్రణాళిక

బొబ్బిలి : పట్టణాభివృద్ధికి సమగ్ర ప్రణాళికలు రూపొందించినట్లు మున్సిపల్ ఛైర్మన్ సావు వెంకట మురళీకృష్ణ చెప్పారు. గొల్లపల్లి 12వ వార్డులో పర్యటించి ప్రజలను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం అభివృద్ధి పనులను పరిశీలించారు. పనుల్లో నాణ్యత పాటించాలని కోరారు. ఆయనతో మున్సిపల్ కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు, ఇన్‌ఛార్జి డిఇ రవికుమార్, శానిటరీ ఇన్స్పెక్టర్ అనుపమ పాల్గొన్నారు.

వసతిగృహాన్ని సందర్శించిన టిఎన్ఎస్ఎఫ్

విజయనగరం కోట : సంక్షేమ హాస్టల్ పోరుబాట కార్యక్రమంలో భాగంగా నగరంలోని బిసి హాస్టల్‌ను టిఎన్ఎస్ఎఫ్ నాయకులు సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడి, వారి సమస్యలు తెలుసు కున్నారు. దుప్పట్లు పంపిణీ చేయకపోవడాన్ని గుర్తించి, దగ్గరుండి అందజేసేలా చూశారు. కార్యక్రమంలో టిఎన్ఎస్ఎఫ్ పార్లమెంట్ అధ్యక్షులు పి.టి.రామ నాయుడు, ప్రధాన కార్యదర్శి ఎం.భాను ప్రకాష్, ఎం.వాసుదేవరావు, పికెఎల్ రావు, కె.వెంకటేష్, వి.విజయ్ కుమార్, కాళ్ల గౌరి పాల్గొన్నారు.

మూణ్నాళ్ల ముచ్చటే..

- రూ.5కోట్లతో ఎస్.కోట - భీమసింగి రోడ్డు నిర్మాణం
- పర్యవేక్షణ లోపం... నాశిరకం పనులు
- మడతలు పడిన రోడ్డు...అవస్థలు పడుతున్న జనం

ప్రజాశక్తి - జామి

వైసిపి ప్రభుత్వం చేపట్టిన రహదారి నిర్మాణ పనులు మూడు నాళ్ల ముచ్చటగానే కనిపిస్తోంది. కోట్ల రూపాయలు వెచ్చించి రహదారి నిర్మాణం చేపట్టినా అధికారుల పర్యవేక్షణ లోపం, నాణ్యత ప్రమాణాలు పాటించకపోవడంతో నూతనంగా నిర్మించిన రహదారే ఎక్కడికక్కడ మడతలు పడి గోతులమయమైంది. ఈ దారుణానికి భీమసింగి, ఎస్.కోట ప్రధాన రహదారి అద్దం పడుతోంది.

ఎస్.కోట నుంచి బీమసింగి వరకు 19 కిలోమీటర్ల రహదారిని సుమారు రూ.5కోట్లు వెచ్చించి నిర్మాణం చేశారు. దీంట్లో జామి, భీమసింగి జంక్షన్‌లను కలిపే 5 కిలో మీటర్ల రహదారి దాదాపుగా ధ్వంసమైంది. రోడ్డు నిర్మాణం జరిగి, మూడు నెలలు మించకుండానే రోడ్డంతా చిత్తడి చిత్తడిగా మారింది. కనీసం మనిషి నడవడానికి కూడా వీల్లేని విధంగా రోడ్డు పెచ్చులు లేచిపోవడంతో ప్రయాణికులు, ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. ఒక్క జామి, భీమసింగి రహదారి మాత్రమే కాదు, జామి నుంచి ఎస్.కోట వెళ్ళే రహదారి, బీమసింగి నుంచి కొత్తవలస రహదారి అధ్వానంగా తయారయ్యాయి.


ఎస్‌కోట నుంచి భీమసింగికు వెళ్లే రహదారి పరిస్థితి ఇదీ...

నాసిరకం పనులు వల్లే..

నాసిరకం పనులు చేసి, కోట్లాది రూపాయలు ప్రజాధనం దుర్వినియోగం కావడం పట్ల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే ఉన్నతాధికారులు దృష్టి సారించి, బీమసింగి, జామి రహదారులను పరిశీలించి, కాంట్రాక్టర్‌పై తగు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

పర్యవేక్షణ లోపమే...!

వాస్తవానికి రహదారి నిర్మాణం జరిగి, కొన్ని రోజులకే పాడవడం కేవలం అధికారుల పర్యవేక్షణ లోపమే అన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. పనులు జరిగినపుడు అధికారులు పర్యవేక్షణ ఉంటే, ఇంత నాసిరకంగా నిర్మాణం జరిగి ఉండేది కాదని అంటున్నారు. ఇప్పటికైనా అధికారుల పర్యవేక్షణ చేసేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

గ్రీన్ ఫీల్డ్ హైవే పనులే కారణం

రహదారి ధ్వంసమవడానికి ప్రధాన కారణం గ్రీన్ ఫీల్డ్ హైవే పనులే. భారీ వాహనాలు నడపడం, రహదారికి వాటరింగ్ చేయడం కారణంగానే రోడ్డు పాడైంది. దీనిపై ఇప్పటికే ఉన్నతాధికారులు హైవే అధారిటీకి నివేదించారు. త్వరలో రోడ్డు మరమ్మతులకు హైవే వాళ్ళు నిధులు ఇస్తామని అన్నారు. నిధులు వస్తె మరమ్మతులు చేపడతాం.

- విశాల్ గుప్తా, ఆర్ అండ్ బి, జెఇ


సదస్సులో మాట్లాడుతున్న కమిషనర్ బాలాజీ ప్రసాద్

రీ సర్వేపై అవగాహన సదస్సు

నెల్లిమర్ల : నగర పంచాయతీలో భూముల రీసర్వేపై గురువారం స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో కమిషనర్ బాలాజీ ప్రసాద్ సిబ్బందికి అవగాహన కల్పించారు. 'వైఎస్‌ఆర్ జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష పథకంలో భాగంగా అన్ని భూములకూ సంబంధించిన రీసర్వే చేసి రికార్డులను ఆన్‌లైన్ చేయడానికి వార్డు పరిపాలనా కార్యదర్శులు, వార్డు ప్లానింగ్ కార్యదర్శులు, వార్డు రెవెన్యూ కార్యదర్శులతో ఆయన సమావేశం నిర్వహించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అన్ని భూములనూ రీసర్వే చేయడానికి సంబంధించిన రికార్డులు సిద్ధం చేసుకొని పూర్తి స్థాయిలో సర్వే చేసి వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపరచాలని సూచించారు. ఈ సమావేశంలో మేనేజర్ టివియస్ విశ్వేశ్వరరావు, టిపిఒ ఎం.పి జనార్ధన రావు, ఆర్‌ఐ కె.త్రినాథ్, సీనియర్ సహాయకులు వైఎస్‌సిహెచ్ పాపయ్య రాజు, నగర పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

అభ్యసన సామర్థ్యం పెంపొందించాలి

రేగిడి : పాఠశాల విద్యార్థులకు తెలుగు, గణితం అభ్యసన సామర్థ్యం పెంపొందించాలని ఎంఇఒ ఎం. వర ప్రసాదరావు సూచించారు. గురువారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఉపాధ్యాయులకు రెండో విడత నాలుగు రోజుల టిఎఆర్‌ఎల్ శిక్షణ కార్యక్రమం ప్రారంభించారు. పాఠశాల ఉపాధ్యాయులకు టీచింగ్ అట్ రైట్ లెవెల్ అనే కార్యక్రమంలో 3,4,5 తరగతుల విద్యార్థులకు తెలుగు, గణితంలో అభ్యసన సామర్థ్యాలు అభివృద్ధి చేయడానికి కమాల్ మెథడాలజీ అనే బోధనా పద్ధతి ద్వారా కృత్యాధార బోధన పై శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలను విద్యార్థులకు బోధించాలని సూచించారు. కోర్స్ డైరెక్టర్లు ఎండువ సీత న్యాయుడు, బుక్కురు భువనేశ్వర్ రావు, కెంబూరు చంద్రరావు, కలగాటి మోహన్‌రావు డిఆర్‌పిలుగా వ్యవహరించారు.

నేడు లెండిలో 'ఐఏఎస్‌సి'సదస్సు

డెంకాడ : జొన్నాడ సమీపంలోని లెండి ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సెక్యూరిటీ అండ్ కమ్యూనికేషన్(ఐఏఎస్‌సి) పై అంతర్జాతీయ సదస్సు నిర్వహించనున్నామని లెండి ఇంజనీరింగ్ కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ హరిబాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశం రెండు రోజులు పాటు జరుగుతుందని ఆయన చెప్పారు. ఈ సదస్సు పరిశోధక పనులకు, జ్ఞానాన్ని పెంపొందించడానికి ఉపయోగపడుతుందన్నారు.

తుప్పలు, డొంకలు తొలగింపు

'ప్రజాశక్తి' కథనానికి స్పందన

వేపాడ : మండలంలో గ్రామీణ రహదారులకు పొంచి ఉన్న ప్రమాదం అనే శీర్షికన ప్రజాశక్తి దినపత్రికలో వెలువడిన కథనానికి స్పందించిన ఉపాధి హామీ ఎపిఒ వల్లంపూడి పైడితల్లమ్మ కూడలి నుండి దబ్బిరాజుపేట, చామలపల్లి, కొండగుల్ల వరకు సుమారు మూడు కిలోమీటర్లు రోడ్డు కిరువైపులా దట్టంగా, ఏపుగా పెరిగిన డొంకలను, పిచ్చి మొక్కలను, ముళ్ల పొదలను గురువారం తొలగించారు. రోడ్డుకు ఇరువైపులా పిచ్చి మొక్కలు పెరిగి మలుపుల వద్ద ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించకపోవడంతో ప్రమాదాలు జరిగేవి. ఇప్పుడు ఆ డొంకలు, పిచ్చిమొక్కలను తొలగించడంతో ప్రయాణికులు హర్షం వ్యక్తం చేశారు.

ఘనంగా పోలిపాడ్యమి వేడుకలు

వేపాడ : కార్తీకమాసం ముగిసిన తరువాత వచ్చిన పాడ్యమి రోజు కావడంతో గురువారం పోలి పాడ్యమి వేడుకలను పలు గ్రామాల్లో మహిళలు ఘనంగా నిర్వహించుకున్నారు. నీలకంఠరాజుపురం గ్రామంలో మహిళలు శివలింగం వద్ద ఓంకారం ఆకారంలో దీపాలు వెలిగించి ప్రత్యేక పూజలు చేశారు.

రెండవ విడత టిఎఆర్‌ఎల్ శిక్షణ

వేపాడ : స్థానిక విద్యాశాఖ కార్యాలయంలో గురువారం ఉపాధ్యాయులకు రెండవ విడత టిఎఆర్‌ఎల్ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంపిడిఒ పట్నాయక్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన విద్యా విధానంలో విద్యార్థులకు అర్థమయ్యే విధంగా బోధించాలన్నారు. ఈ సమావేశంలో ఉపాధ్యాయులు, సిఆర్‌పిలు తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటి కుళాయికి రూ.31.53 కోట్లు

పూసపాటిరేగ : జలజీవన్ మిషన్‌లో భాగంగా మండలానికి ఇంటింటి కుళాయి నిమిత్తం రూ. 31.53కోట్లు మంజూరయ్యాయని ఎంపిపి మహంతి కళ్యాణి తెలిపారు. గతంలో మంజూరైన నిధులు చాలవంటూ మళ్లీ ప్రతిపాదనలు చేసామన్నారు. దీనికి స్పందించి నిధులు మంజూరుకు సహకరించిన ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనువాసరావుకు కృతజ్ఞతలు తెలిపారు. మండలంలోని 28 పంచాయతీల్లో 78 గ్రామాల్లో ఇంటింటి కుళాయి శతశాతం పూర్తవుతోందన్నారు. ఇప్పటికే పలు గ్రామాల్లో పనులు ప్రారంభమయ్యాయన్నారు. మిగతా గ్రామాల్లో కూడా పనులు త్వరలో ప్రారంభమవుతాయని ఆమె చెప్పారు.

సచివాలయాన్ని సందర్శించిన ఎంపిపి


ఫోన్‌లో సిబ్బంది తీరుపై ఆరా తీస్తున్న ఎంపిపి

వేపాడ : మండలంలోని వీలు పర్తి సచివాలయాన్ని ఎంపిపి డి. సత్యవంతుడు గురువారం పరిశీలించారు. సచివాలయ సిబ్బంది పని తీరుపై ఆరా తీసి సక్రమంగా విధులకు హాజరు కావడం లేదని వచ్చిన ఫిర్యాదులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోసారి ఇటువంటి ఆరోపణలు వస్తే సచివాలయం సిబ్బందిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ పరిశీలనలో వైస్ ఎంపిపి అడపా ఈశ్వరరావు, గ్రామ పెద్ద సేనాపతి అప్పారావు, గోకాడ సత్యం నాయుడు పాల్గొన్నారు.

నాడు-నేడు పనుల పరిశీలన

భోగాపురం: మండలంలోని తూడేం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రెండో విడత నాడు నేడు పనులను ఎంఇఒ రమణమూర్తి గురువారం పరిశీలించారు. పాఠశాలకి రూ. 1.19 కోట్లు నిధులు మంజూరైనట్లు ఆయన తెలిపారు. పనులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఆయన వెంట వైసిపి మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణ, ఎంపిడిఒ రమణమూర్తి, ఎపిఎం ఎలమంచిలి రమణ, స్థానిక నాయకులు రాజారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మొయిదలో అన్నదానం


అన్నదానంలో పాల్గొన్న ఎమ్మెల్సీ సురేష్‌బాబు

నెల్లిమర్ల : మండలంలోని మొయిదలో గురువారం ఎమ్మెల్సీ పి. సురేశ్ బాబు స్వగృహంలో కార్తీక మాసం ముగింపు సంధర్భంగా పోలి పాడ్యమిని పురస్కరించుకొని 5వేల మందికి అన్నదానం చేశారు. కార్తీక మాసం ముగిసిన సంధర్భంగా భక్తులకు అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఎమ్మెల్సీ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి పెనుమత్స సంతోష్ బాబు, సర్పంచ్ అట్టాడ కృష్ణ, పిఎసిఎస్ అధ్యక్షులు అట్టాడ కనకారావు తదితరులు పాల్గొన్నారు.

పుణ్యగిరి ఆదాయం రూ 4.30 లక్షలు

ప్రజాశక్తి - శృంగవరపుకోట

పట్టణంలోని పుణ్యగిరి కొండపై గల శ్రీ ఉమా కోటిలింగేశ్వర స్వామి దేవాలయం నెల రోజులు కార్తీక మాసం అనంతరం గురువారం ఆలయ హుండీని లెక్కించగా రూ. 4.30 లక్షలు ఆదాయం వచ్చిందని ఆలయ కార్యనిర్వాహణాధికారి నాగేంద్ర తెలిపారు. ఈ ఆదాయం లెక్కింపు జిల్లా దేవాదాయశాఖ అధికారిని వైవి రమణి పరివేక్షణలో నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మా శవాలపై కాలువ తవ్వండి

గ్రామసభలో కృష్ణాపురం రైతులు ఆవేదన

ప్రజాశక్తి - శృంగవరపుకోట

చిలకల గెడ్డ మీదగా తాటిపూడికి డిజైన్ మార్చకపోతే 'మా గ్రామస్తులందరినీ చంపి మా సవాలపై కాలువ తవ్వాలని, ఎట్టి పరిస్థితిలోనూ కాలువ తవ్వేందుకు మేము ఒప్పుకోమని' రైతులు తెగేసి చెప్పారు. భూసేకరణ ప్రత్యేక ఉప కలెక్టర్ బి. సుదర్శన్ దొర ఆధ్వర్యంలో గురువారం మండలంలోని కృష్ణాపురంలో పోలవరం ఎడమ కాలువ కాలువ నిర్మాణం కోసం భూసేకరణకు గ్రామసభను నిర్వహించారు. ఈ సందర్భంగా కాలువ నిర్మాణం కోసం భూములు ఇవ్వాలని కోరగా డిజైన్ అయినా మార్చాలని లేదా రైతుల భూమి ఎంత పోతుందో అంత భూమైనా ఇవ్వాలని రైతులను ఆదుకోవాలని కోరారు. గ్రామంలో ఉన్న అన్ని కుటుంబాలకు చెందిన భూములు కోల్పోవాల్సి వస్తుందని అందువల్ల భూములు ఇచ్చే ప్రసక్తే లేదని కాలువ తవ్వదలుచుకుంటే ప్రాణాలర్పించడానికి సిద్ధంగా ఉన్నామని చెప్పారు. ఇదే పంచాయతీకి చెందిన భీమవరం రైతులు గతంలో తాటిపూడిలో కూడా నిర్వాసితులయ్యారని మరలా భూమి లాక్కుంటామంటే తమ బ్రతుకులు ఏం కావాలని గగ్గోలు పెట్టారు. ఒక దశలో సర్పంచ్ మేడపరెడ్డి ఈశ్వరరావు ఆధ్వర్యంలో కృష్ణాపురం రైతులందరూ


గ్రామ సభలో మాట్లాడుతున్న ఉప కలెక్టర్ సుదర్శన్

ముక్తకంఠంగా అధికారులపై తిరుగుబాటుకు యత్నించారు. వెంటనే ఉప కలెక్టర్ బి సుదర్శన్ దొర చొరవ తీసుకుని మాట్లాడుతూ పై విషయాలన్నీ ఉన్నతాధికారులకు తెలియజేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం పోరాట కమిటీ కో కన్వీనర్ గనివాడ సన్యాసినాయుడు ఆధ్వర్యంలో రైతులందరూ డిజైన్ మార్చాలని ఏకవాక్య తీర్మానం చేసి ఉప కలెక్టర్‌కు వినతి పత్రం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, పోలవరం ఎడమ కాలువ ఇంజనీరింగ్ సిబ్బంది రైతులతో పాటు, పోరాట కమిటీ సభ్యులు రైతులు పాల్గొన్నారు


పురిటిపెంటలో గడపగడపకు..

ప్రజాశక్తి- గజపతినగరం

మండలంలోని గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గురువారం పురిటి పెంట న్యూ కాలనీలో ఎమ్మెల్యే బొత్స అప్పల నర్సయ్య, ఎమ్మెల్సీ పి.సురేష్ బాబు పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ కార్యక్రమాలు అందుతున్న తీరును లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలను ప్రభుత్వం అందిస్తోందని తెలిపారు. అర్హులై ఉండి పథకాలందని వారు వుంటే సచివాలయాల్లో దరఖాస్తు చేసుకుంటే మంజూరు చేస్తామని ఈ సందర్భంగా ఎమ్మెల్యే తెలిపారు.

జీవనోపాధి కల్పించండి

ఎన్‌హెచ్ 26 రహదారికి ఇరువైపులా ఏళ్ల తరబడి దుకాణాలు పెట్టుకొని జీవనం సాగిస్తున్న తమను అన్యాయంగా తొలగించారని బాధితులు ఎమ్మెల్యే వద్ద వాపోయారు. సిపిఎం నాయకులు రాకోటి రాములు అధ్వర్యాన ఎమ్మెల్యేకు పురిటిపెంట సచివాలయం వద్ద వినతి అందజేసారు. తాము రోడ్ వెడల్పునకు వ్యతిరేకం కాదని, కానీ నిబంధనలకు విరుద్ధంగా తమ షాపులు తొలగించారని బాధితులు వాపోయారు. సుమారు 30, 40 ఏళ్లు గా చిన్న చిన్న షాపులు పెట్టుకొని బతుకుతున్న తమకు జీవనోపాధి తీసేశారని చెప్పారు. ఎమ్మెల్యే స్పందిస్తూ అర్‌అండ్‌బి డిఇతో మాట్లాడి రహదారి పనులు పూర్తయ్యాక ఎవరి స్థలాల్లో వారికి అవకాశం కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి గార తవుడు, పిఎసిఎస్ అధ్యక్షులు కరణం ఆదినారాయణ, వైసిపి నాయకులు బెల్లాన త్రినాథ, మండలి సురేష్, వైసిపి మండల అధ్యక్షులు బూడి వెంకటరావు, ఎంపిటిసిలు, సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


బ్రోచర్‌ను అందిస్తున్న ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య

21 రోజుల్లో రైతుల ఖాతాల్లోకి ధాన్యం సొమ్ము

ప్రజాశక్తి- జామి

నిబంధనల ప్రకారం ధాన్యం కొనుగోలు జరిగిన 21 రోజుల్లో రైతు బ్యాంకు ఖాతాకు డబ్బు జమ అవుతోందని తహశీల్దార్ హేమంత్ కుమార్ అన్నారు. గురువారం జామి మండల పరిషత్ సమావేశ భవనంలో ధాన్యం కొనుగోలు అంశాల పై సమావేశాన్ని నిర్వహించారు. వ్యవసాయాధికారి కిరణ్ కుమార్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో తహశీల్దార్ పాల్గొని మాట్లాడారు. రైతులు నాణ్యత ప్రమాణాలు అనుసరించాలని, తేమ 17 శాతం కన్నా తక్కువ ఉండేలా చూసుకోనేలా రైతులందరికి అవగాహనా కల్పించామని అన్నారు. గోనె సంచులను పిఎసిఎస్, ఎఫ్‌పిఒ, ఆర్‌బికెల ద్వారా సరఫరా చేస్తామని, రైతులు కూడా సొంతంగా కొనుక్కుని ధాన్యం మిల్‌కి పంపితే దానికి సంబంధించి ఒకో బస్తాకి రూ. 3.39 ధాన్యం డబ్బుతో పాటు రైతుకు జమ అవుతుందని తెలిపారు.


జామి: సమావేశంలో మాట్లాడుతున్న తహశీల్దార్ హేమంత్‌కుమార్

హమాలీలు గోనె సంచికి నింపి, కుట్టి, లారీకి లోడ్ చేస్తే ఒక క్వింటాకు రూ. 25లు ప్రభుత్వం ఇస్తుందని, రైతులు భరిస్తే రైతుకు చెల్లిస్తామని తెలియజేశారు. అనంతరం వ్యవసాయ సహాయకులకు, టెక్నికల్ అసిస్టెంట్స్, డేటా ఎంట్రీ ఆపరేటర్స్, జామి, అన్నంరాజుపేట పిఎసిఎస్ రైతులు, పాల ఉత్పత్తి దారుల సంఘాల సభ్యులకు ధాన్యం కొనుగోలుపై అవగాహన కల్పించారు.

ధాన్యం కొనుగోలు పై అవగాహన

వేపాడ : స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో ధాన్యం కొనుగోలుపై సచివాలయ సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంపిపి దొగ్గ సత్యవంతుడు మాట్లాడుతూ ధాన్యం కొనుగోళ్లలో ఏ విధమైన సమస్యలున్నా తీసుకుని వస్తే ప్రజా ప్రతినిధులుగా సమస్యలు పరిష్కరించడమే కాకుండా రైతులు పండించే ధాన్యానికి గిట్టుబాటు ధర అయ్యేవిధంగా కృషి చేస్తామన్నారు. ఈ సమావేశంలో జెడ్‌పిటిసి సేనాపతి అప్పలనాయుడు, వైస్ ఎంపిపి అడపా ఈశ్వర్‌రావు, మండల అగ్రికల్చర్ అభివృద్ధి కమిటీ చైర్మన్ ఈర్లే బంగారు నాయుడు, ఎంపిడిఒ బిఎస్ఎన్‌కె పట్నాయక్, తహశీల్దార్ ఎస్. కృష్ణంరాజు, ఎఒ యశ్వంత్ కుమార్, సచివాలయ సిబ్బంది, విఎఎలు, డిఎలు, టీసీలు, వాలంటీర్లు, కోపరేటివ్ బ్యాంకు సిఇఒ అప్పారావు పాల్గొన్నారు.

భోగాపురం: ప్రతి రైతు వద్ద కనీస మద్దతు ధరతో ధాన్యం కొనుగోలు చేయాలని, ఇందులో ఎటువంటి ఆరోపణలు వచ్చిన సహించేది లేదని వైసిపి మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ధాన్యం కొనుగోలు సిబ్బంది, వాలంటీర్లు, వ్యవసాయ సహాయకులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిర్ణయించిన క్వాలిటీని అనుసరించి కామన్ రకానికి క్వింటాకు రూ. 2040, ఏ రకం ధాన్యం క్వింటాకు రూ.2060 ప్రభుత్వం ప్రకటించిందని తెలిపారు. అనంతరం ఎఒ హరికృష్ణ మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు విషయంలో మిల్లర్లు పాత్ర పూర్తిగా రద్దు చేసిందని తెలిపారు. ఈ సమావేశంలో ఎంపిడిఒ బంగారయ్య, సిఎస్‌డిటి మురళి, హెచ్‌డిటి శ్రీనివాసరావు సిబ్బంది పాల్గొన్నారు.



వేపాడ: సూచనలు చేస్తున్న ఎంపిపి సత్యవంతుడు

ఆర్‌బికెల్లోనే ధాన్యం కొనుగోలు

గరివిడి: మండలంలోని ప్రతి ఆర్‌బికెలో ధాన్యం కొనుగోలు చేస్తామని చీపురపల్లి తహశీల్దార్ యం. సురేష్ అన్నారు. తన కార్యాలయంలో గురువారం సొసైటీలు, రైస్ మిలర్స్, స్థానిక నాయకులు, రైతు సంఘం సభ్యులతో ఆయన సమావేశం నిర్వహించారు. రైతులకు ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోలుకు ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. ఈ సమావేశంలో వైసిపి నాయకులు ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, మార్కెట్ కమిటీ చైర్మన్ దన్నాన జనార్దన్, మండల వ్యవసాయ సలహాదారుల సంఘం సభ్యులు నారాయణ రావు పాల్గొన్నారు.

ఓటు హక్కు నమోదు చేసుకోవాలి

ప్రజాశక్తి - వంగర

18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కును నమోదు చేసుకోవాలని తహశీల్దార్ డి. ఐజాక్ అన్నారు. మండల కేంద్రంలో అంబేద్కర్ కూడలి వద్ద గురువారం మానవహారం నిర్వహించి ఓటు హక్కు వినియోగం పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డిటి సుందర రావు, ఆర్‌ఐ మురళి, విద్యార్థులు పాల్గొన్నారు.



వంగర: మానవహారం చేస్తున్న విద్యార్థులు

ఓటు హక్కుపై అవగాహన

శృంగవరపుకోట : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కళాశాల రాజనీతి శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో ఇంచార్జి ప్రిన్సిపల్ ఎం.రమేష్ కుమార్ అధ్యక్షతన ఓటరు నమోదు అవగాహన కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ 18 సంవత్సరాల నిండిన ప్రతి పౌరుడు ఓటు నమోదు చేసుకునే ప్రక్రియలో బాధ్యతగా ఉండాలని, ఓటు విలువ తెలుసుకోవాలని సూచించారు. ఎలక్షన్ డిటి లక్ష్మీ మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన విద్యార్థులు ఓటు హక్కు నమోదులో భాగంగా ఫారం 6ని ఎలా నింపాలి, అలాగే ఆన్లైన్ ద్వారా నమోదు చేసుకునే ప్రక్రియను విద్యార్థులకు తమ మొబైల్ ఫోన్లో ఎన్‌విపి యాప్ ద్వారా నమోదు చేసుకునే విధానాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు బి.సంధ్యారాణి, సిహెచ్. శ్రీనివాసరావు, ఇతర అధ్యాపకులు, విద్యార్థులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు..

ఆక్రమణ భూముల సర్వే

'ప్రజాశక్తి' కథనానికి స్పందన

ప్రజాశక్తి - లక్కవరపుకోట

మండల కేంద్రంలో దుకాణాల పేరిట ఆక్రమించిన భూములను స్థానిక తహశీల్దార్ తామరాపల్లి రామకృష్ణ గురువారం పరిశీలించి సర్వే చేశారు. గురువారం ప్రజాశక్తి దినపత్రికలో 'పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న దుకాణాలు' పేరిట ప్రచురణమైన కథనానికి స్పందించిన రెవెన్యూ అధికారులు ఆక్రమణకు గురైన భూములను పరిశీలించారు. మండల వ్యవసాయశాఖ కార్యాలయ వెనుక భాగాన గల లక్కవరపుకోట - శృంగవరపుకోట ప్రధాన రహదారికి ఆనుకుని ప్రభుత్వ భూమిని ఆక్రమించి నిర్మిస్తున్న దుకాణాలను పరిశీలించారు. ఇదిలా ఉండగా కోపరేటివ్ బ్యాంక్ వెనుక భాగాన డి ఫారం భూములలో ఎటువంటి అనుమతులూ లేకుండా నిర్మిస్తున్న రెండు ఇల్లును గుర్తించారు. మండలానికి చెందిన ఓ అధికార పార్టీ నాయకుడు ఇల్లు నిర్మించుకోమన్నందునే తను రెండు ఇల్లులు కట్టుకుంటున్నానని పల్ల అప్పారావు తెలపడం కొసమెరుపు. ప్రభుత్వ భూమి ఆక్రమణలపై పూర్తి సర్వే జరిపి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తహశీల్దార్ తెలిపారు.


చింతపల్లి బీచ్‌లో సందడి చేస్తున్న పర్యాటకులు

తీరంలో సందడే.. సందడి

పూసపాటిరేగ : కార్తీక మాసం చివరి రోజు కావడంతో గురువారం మండలంలోని చింతపల్లి తీరాన భక్తులు క్యూ కట్టారు. ఉదయం నుండి అధిక సంఖ్యలో భక్తులు తీరానికి చేరుకొని సముద్ర స్నానాలు చేస్తూ కేరింతలు కొట్టారు. గోవిందపురం ముక్తిధాం క్షేత్రాన్ని సందర్శించి అక్కడ నుండి సముద్ర తీరానికి చేరుకొని సందడి చేశారు. తీరానికి సమీపంలో ఉన్న కొబ్బరి తోటల్లో వనబోజనాలు చేసి సమీపంలో ఉన్న లైట్ హౌస్‌ను సందర్శించారు. అక్కడ నుండి తీరంలో ఇసుక తెన్నులపై సందడి చేస్తూ, సెల్ఫీలు తీసుకుంటా ఆనందం వ్యక్తం చేశారు.

వ్యర్థాలతో బొమ్మల తయారీ

నెల్లిమర్ల : టాయ్ కేతాన్ కార్యక్రమంలో భాగంగా నగర పంచాయతీ పరిధిలోని ఆదిత్య స్కూల్ యాజమాన్యం సహకారంతో విద్యార్థులు వ్యర్థ పదార్థాలతో బొమ్మలను తయారు చేశారు. గురువారం స్వచ్ఛ భారత్ కార్యక్రమలో భాగంగా విద్యార్థులు వాడిపడేసిన ప్లాస్టిక్, అట్టలతో బొమ్మలు తయారు చేశారు. ఈ సందర్భంగా నగర పంచాయతీ శానటరీ ఇన్‌స్పెక్టర్ బి. శ్రీనివాసరావు విద్యార్థులను అభినందించారు. అనంతరం ఆయన మాట్లాఉతూ విద్యార్థుల్లో సృజనాత్మకత వెలికి తీయడానికి ఇటువంటి కార్యక్రమాలు ఉపయోగపడతాయన్నారు. ఇప్పటికే వేస్ట్ మెటీరియల్ ద్వారా అనేక రకాల ఉత్పత్తులు స్మాల్ స్కేల్ ఇండస్ట్రీస్ ద్వారా తయారు చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో నగర పంచాయతీ శానిటరీ సెక్రెటరీలు రవి, పవన్ పాఠశాల ఉపాధ్యాయులు వి.అమృత తదితరులు పాల్గొన్నారు.


తయారు చేసిన బొమ్మలతో విద్యార్థులు

'లెండి'లో అవగాహన సదస్సు

డెంకాడ : లెండి కళాశాలలో వ్యక్తిత్వ వికాస తరగతుల్లో భాగంగా రూట్ టు సక్సెస్ అనే అంశం పై గురువారం సదస్సును నిర్వహించారు. ఇందులో భాగంగా హైదరాబాదుకు చెందిన విజె మర్కన్ సంస్థ ట్రైనర్ కొవ్వూరు నాగిరెడ్డి పాల్గొని విద్యార్థులు ఇంజనీరింగ్ విద్యాభ్యాసం కోసం ఎలా ముందుకు సాగాలి, ఎటువంటి లక్ష్యాలను నిర్దేశించుకోవాలన్న విషయాలను వివరించారు. విలువలతో వ్యక్తిత్వాన్ని నిర్మించుకుంటే సరైన దారిలో ముందుకు సాగవచ్చునన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ రామారెడ్డి, చైర్మన్ మధుసూదన రావు, సెక్రెటరీ కరస్పాండెంట్ శివరామ కృష్ణ, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ హరిబాబులు పాల్గొని అతిధులను సత్కరించారు



సదస్సులో మాట్లాడుతున్న నాగిరెడ్డి

పారదర్శకంగా ధాన్యం కొనుగోలు

ప్రజాశక్తి- బొబ్బిలిరూరల్

ప్రతి రైతూ దళారీ వ్యవస్థ నుండి బయటపడి పారదర్శకంగా ధాన్యం కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకొందని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు తెలిపారు. గురువారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపిపి శంబంగి లక్ష్మి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు ఖాతాల్లో 21 రోజుల్లోనే చెల్లింపులు జరుగుతాయన్నారు. ప్రతి ఇంటికి కుళాయి ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని సంబంధింత అధికార్లను ఆదేశించారు. అనంతరం వివిధ శాఖల అధికారులతో సమీక్ష చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు శంబంగి వేణుగోపాల్ నాయుడు, ఎంపిడిఓ ఎ.భాస్కరరావు, తహశీల్దార్ ఎన్.రాజారావు, జెడ్‌పిటిసి సభ్యులు శాంతకుమారి, వైఎస్ ఎంపిపిలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంబంగి

ఘనంగా అదితి జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-విజయనగరం కోట

టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పూసపాటి అదితి గజపతిరాజు పుట్టినరోజు వేడుకలను గురువారం అశోక్ బంగ్లాలో చెవిటి, మూగ విద్యార్థుల మధ్య నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు పూసపాటి అశోక్ గజపతిరాజు, సునీలా పాల్గొన్నారు.

ఈ సందర్భంగా విద్యార్థులతో కేక్ కట్ చేయించారు. ఆ పాఠశాల విద్యార్థుల్లో ఇద్దరిని అశోక్ కుటుంబం తరపున, ఐదుగురిని టిడిపి నాయకులు ప్రసాదుల లక్ష్మి వరప్రసాద్, బొద్దుల నర్సింగరావు, కంది మురళీనాయుడు, గంటా పోలినాయుడు, రాజేష్‌బాబు ఏడాది పాటు దత్తత తీసుకున్నారు. అందుకోసం రూ.42 వేల విరాళం అందించారు.

మద్యంతో వ్యాపారి అరెస్టు

ప్రజాశక్తి- బొబ్బిలి

మండలంలోని కొండదేవుపల్లి గ్రామానికి చెందిన వ్యాపారి ఎం.కృష్ణమూర్తిని 23 మద్యం సీసాలతో అరెస్టు చేసినట్లు ఎస్ఇబి సిఐ ఆర్.జైభీమ్ తెలిపారు. అక్రమంగా మద్యం తరలిస్తున్నట్లు సమాచారం రావడంతో ఎస్ఇబి పోలీసులు దాడులు చేపట్టారు. బొబ్బిలి నుంచి కొండదేవుపల్లి తరలిస్తుండగా గొల్లపల్లి కూడలి వద్ద కృష్ణమూర్తిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సిఐ చెప్పారు. మద్యం సీసాలను సీజ్ చేశారు. గ్రామాల్లో అక్రమంగా మద్యం, సారా విక్రయిస్తే 9440902372కు సమాచారం ఇవ్వాలని కోరారు. దాడుల్లో ఎస్ఐ చిన్నం నాయుడు, సిబ్బంది జయరాం, ఆదినారాయణ, సరస్వతి పాల్గొన్నారు.